సాక్షి
ఒడిశా



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,19,226లు, బంగారం 4 గ్రాము 450 మిల్లీగ్రాము, వెండి 66గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భారీ నిరసన ప్రదర్శన

దండకారణ్యంలో గిరిజనులు నిరసన ప్రదర్శన చేశారు. తవ్వకాలపై వ్యతిరేకత తెలిపారు.

- 8లో.



వినతుల వెల్లువ

గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. సమస్యలు ఏకరువు పెట్టారు.

- 8లో.

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

గ్రీవెన్స్‌లో 75 వినతుల స్వీకరణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశం హాల్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ దుధూల్ అభిషేక్ దిలిప్ , జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల వారినుంచి 75 వినతులను అధికారులు స్వీకరించారు. వీటిలో 48 వ్యక్తిగత సమస్యలుగా గుర్తించగా 19 సామూహిక గ్రామసమస్యలు, మరో ఎనిమిది వైద్య సంబంధిత సమస్యలుగా గుర్తించారు. స్వీకరించిన సమస్యలను వారి వారి పరిధిలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ ఆదేశించారు.

ఇంజినీర్ల పాత్ర కీలకం



వేడుకల్లో పాల్గొన్న జిస్ ఇంజినీరింగ్ విద్యార్థులు

రాయగడ: ఇంజనీర్ల మేధా శక్తితో అనేక అధునాతన పోకడలకు శ్రీకారం చుడుతున్నారని.. కొత్త ప్రపంచాన్ని సృష్టించడంలో వీరి పాత్ర చాలా కీలకంగా మారుతుందని ప్రొఫెసర్ దిలీప్ కుమార్ మిశ్రా అభిప్రాయపడ్డారు. సదరు సమితి పరిధిలోని ఖొల్లిగుడ వద్ద గల జిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ.. నేషన్ బిల్డింగ్‌కు ఇంజనీర్ల చేస్తున్న సేవలు అపారమని కొనియాడారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఆధునిక పోకడలకు అనుగుణంగా ముందుకు సాగాలని హితవుపలికారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్ పట్నాయక్, కాళి ప్రసాద్ ఆచార్య, బాదల్ కుమార్ ఆచార్య, జయంత్ పట్టజోషి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం





సంఘటన స్థలం వద్ద రాజు మృతదేహం (ఇన్‌సెట్లో) ప్రమాదానికి గురైన రాజు బైకు

రాయగడ: కొలనార సమితి పరిధిలో గల ముకుందపూర్ ఘాటీ మలుపులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరు 8 ఏళ్ల చిన్నారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రామనగుడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... జిల్లాలోని పద్మపూర్‌కు చెందిన ఎల్ రాజు పెంటి అనే వ్యక్తి బైకులో మేనత్త, ఇద్దరు పిల్లలతో కలసి పద్మపూర్ నుంచి రాయగడకు వెళ్తున్న సమయంలో ముకుందపూర్ సమీపంలో గల హతిఖంబ గ్రామం భగుడి ఘాటి మలుపులో ఎదురుగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడిపిస్తున్న రాజు తీవ్రగాయాలకు గురై మృతి చెందగా గాయాలు తగిలిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ముకుందపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీ కొట్టి వెళ్లిపోయిన వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

జగన్నాథుని చూస్తూ..

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో రత్న వేదికపై శ్రీ జగన్నాథుని దర్శించుకునే సమయంలో ఓ మహిళా భక్తురాలు అకస్మాత్తుగా కుప్పకూలి పోయింది. అస్వస్థతకు గురైనట్లు గుర్తించి తక్షణమే స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. మరణించిన భక్తురాలు ఖండపడా ప్రాంతానికి చెందిన మంజులత సాహుగా గుర్తించారు.



మా భగవతీ మందిరంలో పూజారికి పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



అంజుమాలను స్వీకరించిన ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం.. దసరా ఉత్సవాలకు శ్రీకారం



రాజుల కాలం నుంచి జరుగుతున్న చారిత్రక దసరా ఉత్సవాలకు ఆదివారం రాత్రి శ్రీకారం చుట్టారు. జయపురం దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మా భగవతీ మందిరంలో పవిత్ర మూలాష్టమి సందర్భంగా 16 వ ఉపచార పూజలు జరిపటంతో జయపురం దసరా ఉత్సవాల పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఎమ్మెల్యే బాహిణీపతి ఆలయ పూజారి కృష్ణ చంద్ర దాస్ నుంచి అంజుమాల స్వీకరించారు. అంజుమాల స్వీకారంతో జయపురం దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో పలు గ్రామ దేవతల పీఠాలకు ఆహ్వానాలు పంపే కార్యక్రమం ప్రారంభించారు. అంజుమాల పూజలు జరిపిన ఎమ్మెల్యే ముందుగా ఉత్కళుల ఆరాధ్య దైవం శ్రీజగన్నాథుని మందిరానికి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణఘడ్‌లో వేంచేసి ఉన్న మరో ఆరాధ్య దేవి దక్షిణ కాళీ మందిరంలో దక్షిణ కాళీకి కూడా 16వ ఉపచార పూజలు జరిపారు. నేటితో జయపురంలో దసరా ఉత్సవ వాతావరణం నెలకొంది. దసరా వేడుకలను ప్రశాంతంగా, ఘనంగా ప్రజలు జరుపుకోవాలని బాహిణీపతి ప్రజలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమాలలో జయపురం మునిసిపాలిటీ ఛైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, నిహారంజన్ బిశాయి, గంగా సాహు, పిల్లు మహాపాత్రో, మున్నా దాస్, సిద్ధ దాస్ పరిచ తదితరులు పాల్గొన్నారు.

– జయపురం



మా భగవతీ దేవికి పూజలు చేస్తున్న బాహిణీపతి



దసరా ఉత్సవాలు జరిపేందుకు ఎమ్మెల్యేకు కంకణం కడుతున్న పూజారి



శ్రీజగన్నాథునికి పూజలు చేసిన ఎమ్మెల్యే తదితరులు

గుమ్మఘాటీలో బస్సు ప్రమాదం

- 8 మందికి గాయాలు







బస్సు ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు



ప్రమాదానికి గురైన బస్సు

రాయగడ: గుణుపూర్ నుంచి జయపురానికి వెళ్లే గోల్డెన్ రాక్ ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారుఝామున ప్రమాదానికి గురైంది. సదరు సమితి పరిధిలో గల గుమ్మ ఘాటీ మలుపులో అదుపుతప్పిన బస్సు రోడ్డు పక్కకు దూసుకువెళ్లిపోవడంతో బస్సులో ప్రయాణిస్తున్న 40 మంది ప్రయాణికుల్లో 8 మంది గాయాలపాలయ్యారు. గుమ్మఘాటి మలుపు దిగుతున్న సమయంలో బస్సు అదుపు తప్పడంతో రోడ్డు సైడుకు దూసుకుపోయింది. డ్రైవరు చాకచక్యంతో వ్యవహరించి బస్సును అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. గుణుపూర్ నుంచి సోమవారం అర్ధరాత్రి బయల్దేరిన బస్సు గుమ్మఘాటి దిగుతున్న సమయంలో ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగాక అంబులెన్స్ రాకపోవడంతో క్షతగాత్రులను పోలీసులు, స్థానికులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

నాల్కో వద్ద ఉద్రిక్త పరిస్థితులు



ఆందోళనకారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీతం పాఢి



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు



నాల్కో ప్రధాన ద్వారం వద్ద ఆందోళన కారులు

కొరాపుట్: భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం కొరాపుట్ జిల్లా దమంజోడిలో నాల్కో ప్రధాన ద్వారం వద్ద నిర్వాసితులు బైఠాయించారు. ఈ ప్రాంతంలో అల్యూమినియం శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు తమ భూములు ప్రభుత్వం తీసుకుందన్నారు. నాడు ఉపాధి కల్పిస్తామని చెప్పి చిన్న చిన్న ఉపాధి పనులు కల్పించారన్నారు. తాము భూమిని నమ్ముకున్న ఆదివాసీలమని గుర్తు చేశారు. తరతరాలుగా వంశ పారపర్యంగా భూమి సాగు చేసుకుంటున్నామని అన్నారు. కానీ నాడు భూమి తీసుకున్నప్పుడు నిర్వాసితులకు చిన్న చిన్న ఉపాధి పనులు ఇచ్చి చేతులు దులుపు కున్నారని, ఉపాధి పొందిన వారు చనిపోయాక వారి కుటుంబంలో అర్హత ఉన్న వారికి కూలి పనులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము రోడ్డున పడ్డామన్నారు. తమకు వ్యవసాయం లేదా కూలి పనులు మాత్రమే తెలుసని అన్నారు. ఈ రెండు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఈ సమస్యపై తాము ఎన్నిసార్లు నాల్కో ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. పరిశ్రమ లోపల ఉన్న వారు బయటకు రాలేక పోయారు. ముడి బాక్సైట్ తో వచ్చిన వాహనాలు నాల్కో బయట ఉండి పోయాయి. వీరికి సంఘీభావంగా పొట్టంగి మాజీ ఎమ్మెల్యే పీతం పాఢి ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పినా వారు ఆందోళన విరమించలేదు.

అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సన్నద్ధత

భువనేశ్వర్: శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు కాంగ్రెసు సన్నద్ధత వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ శాసన సభ నాయకుడు రామచంద్ర కదమ్ ఈ విషయం వెల్లడించారు. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్‌కు సభలో 51 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. వారి సహకారం తీసుకుంటామన్నారు. బీజేడీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే కాంగ్రెస్ సహకారం అందిస్తుందని, లేకుంటే కాంగ్రెసు స్వతంత్రంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలి గందరగోళ పరిస్థితి తాండవిస్తుంది. ప్రజలు సురక్షితంగా లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

లింగరాజ ఆలయంలో భక్తుడికి గాయాలు

భువనేశ్వర్: స్థానిక ఏకామ్ర క్షేత్రం లింగరాజ ఆలయంలో సోమవారం అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుంది. మహా ప్రభువు దర్శనం కోసం విచ్చేసిన యాత్రికుడు గాయపడ్డాడు. ఆలయ సముదాయం అడప మండపం నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్పించారు. గాయపడిన భక్తుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివవర్ధన్ సింగ్‌గా గుర్తించారు. ఆయన గతంలో అనారోగ్యంతో ఉండి తల తిరగడం వల్ల పడిపోయినట్లు తోటి యాత్రికుల నుంచి తెలిసింది.

యువతే అభివృద్ధి రథ సారథులు



ఉద్యోగ మేళా వేదికపై ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు పొందిన యువత

భువనేశ్వర్: యువతరం శక్తి, సామర్థ్యం, ఉత్సాహం రాష్ట్రాభివృద్ధికి బలమైన సారథ్యం వహిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. యువత శక్తిసామర్థ్యాల్ని సమాజ సంక్షేమానికి ఉపయోగించుకోవడానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాల సృష్టికి పెద్ద పీట వేసిందన్నారు. స్థానిక ఇడ్కో ప్రదర్శన మైదానంలో నిర్వహించిన ఉద్యోగ మేళా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా 7 విభాగాలకు కొత్తగా ఎంపికైన 1,686 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కృషి మరియు దృఢ సంకల్పంతో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారందరికి ముఖ్యమంత్రి అభినందించారు.

అంత్యక్రియలకు తీసుకువస్తే..



పాడిపైనుంచి ఆస్పత్రిలో చికిత్స పడకకు చేరిన లక్ష్మి

భువనేశ్వర్:

పూరీ సాగర తీరం స్వర్గ ద్వారంలో అంత్యక్రియలు స్వర్గలోక ప్రాప్తికి సోపానంగా భావిస్తారు. ఈ క్రమంలో గంజాం జిల్లా నుంచి ఓ వృద్ధ మహిళని అంత్యక్రియల కోసం తీసుకువచ్చారు. దహనకాండ సన్నాహాలు జరుగుతుండగా ఆమె ఒక్కసారిగా కళ్లు తెరిచారు. దీంతో అంతా అవాక్కయ్యారు. కాసేపట్లో ఆమె ప్రాణాలతో బతికే ఉన్నట్లు భావించి హుటాహుటిన అంబులెన్సులో స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె జీవించి ఉన్నట్లు ధ్రువీకరించారు. పాడిపైనుంచి కళ్లు తెరిచి కోలుకున్న వృద్ధ మహిళ గంజాం జిల్లా పాలొసారొ కె.నువాగాంవ్ ప్రాంతానికి చెందిన 86 ఏళ్ళ పి. లక్ష్మిగా గుర్తించారు. ప్రస్తుతం ఈమె పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఏమై ఉంటుంది ..

స్వర్గ ద్వారం శ్మశాన వాటికలో అంత్యక్రియల నిర్వహణకు సంబంధిత మృత వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం అనివార్యం. మృత వ్యక్తి ఆధార్ కార్డు కూడా అవసరం ఉంటుంది. దాని ఆధారంగా వివరాలు నమోదు చేసిన మేరకు దహనకాండకు అనుమతిస్తారు. కానీ ఈమెకు చెందిన పత్రాలు తీసుకు రాలేదు.

సరైన మార్గంలో రాష్ట్ర కాంగ్రెస్



రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ ప్రముఖులు



సమావేశంలో పాలుపంచుకున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖులు

- ఈ నెల 30 నాటికి కొత్త జిల్లా అధ్యక్షుల ప్రకటన
- అక్టోబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర
- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్

భువనేశ్వర్: 'కాంగ్రెస్‌లో అగ్ర, మధ్య, నిమ్న స్థాయి తేడా లేకుండా అందరూ నాయకులే. 2029 మనదే. భక్త చరణ్ దాస్ నాయకత్వంలో ఒడిశాలో కాంగ్రెస్ సరైన మార్గంలో ఉంది. రాహుల్ గాంధీ వేల మైళ్ల పాదయాత్రలో నడుస్తుంటే, మనం ఎందుకు చేయలేము?' అంటూ ఆదివారం స్థానిక కాంగ్రెస్ భవన్‌లో జరిగిన సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని ప్రేరేపించారు. రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో గుజరాత్‌లో జరిగిన 10 రోజుల శిక్షణా శిబిరం తరహాలో ఒడిశా కాంగ్రెస్ కూడా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆయన తెలియజేశారు.
పార్టీ సీనియర్ నాయకులతో కూడిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలందరి సమక్షంలో ప్రజల దృష్టిలో పార్టీ ఇప్పుడు ఒడిశాలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే, భారతీయ జనతా పార్టీ, బిజూ జనతా దళ్ రెండింటినీ ఓడించడం సాధ్యమేనని తెలిపారు. ఒడిశాలోని మొత్తం 35 సంస్థాగత జిల్లాల అధ్యక్షుల ఎంపిక ఈ నెల 30 నాటికి పూర్తవుతుందని, కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుల పనిని ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తారని తెలిపారు. అక్టోబర్‌లో కాంగ్రెస్ అన్ని మండలాలకు చేరుకుంటుందని, నవంబర్, డిసెంబర్‌లో ఓటు దొంగతనం అంశాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లాలని, బూత్ కమిటీలను ఏర్పాటు చేసే పనిని పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పీసీసీ అధ్యక్షుడు ప్రతిపాదించిన గాంధీ జయంతి నుంచి ఏడాది పొడవునా జరిగే రాష్ట్ర వ్యాప్త పాదయాత్రను ఆయన ప్రశంసించారు. క్రియాశీల నాయకులు, కార్మికులు పాల్గొనాలని కోరారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఏఐసీసీ ఒడిశా వ్యవహారాల ఇన్‌చార్జి అజయ్ కుమార్ లల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇప్పుడు రాష్ట్రంలో పురోగమిస్తోందన్నారు. దే చురుకుదనంతో నిరవధికంగా కృషి చేస్తే 2029లో మమ్మల్ని ఆపడం అసాధ్యమని పార్టీ శ్రేణుల్ని ఉత్సాహపరిచారు.

క్లుప్తంగా

కళలను పరిరక్షించాలి


కార్యక్రమంలో పాల్గొన్న గొమాంగొ, బొచ్చ తదితరులు

రాయగడ: సంప్రదాయ కళలను పరిరక్షించి వాటిని నమ్ముకుని ఉన్న కళాకారులను ప్రోత్సాహించాల్సిన బాధ్యత మనందరిదని గుణుపూర్ శాసనసభ మాజీ ఎంఎల్ఏ రఘునాథ్ గొమాంగొ అన్నారు. జిల్లాలోని రామనగుడలొ ఆదివారం సాయంత్రం జరిగిన లోక్ కళా మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రం భిన్న సంస్కృతులకు ప్రతీ కమని అన్నారు.ఎన్నొ కళలు ,కళాకారులు ఉన్నారని వారి ఆచార వ్యవహారాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. కళాకారులను ప్రోత్సాహించగలిగితే కళారంగం ముందుకు కొనసాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాయగడ జిల్లా కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుప్రీత్ సంతోష్ బొచ్చ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సాహించేందుకు వేదికగా జిల్లా కళాకారుల సంఘం ఆవిర్భవించిందని అన్నారు . ప్రభుత్వం గుర్తించిన ఈ సంఘం ద్వారా కళాకారులను ఆదుకొవడంతొ పాటు వారిని ప్రోత్సాహించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన లోక్ కళాకారులకు ఘనంగా సన్మానించారు. ఇటువంటి తరహా కార్యక్రమాలు జిల్లాలొ గల 11 సమితుల్లొ నిర్వహించేందుకు సన్నహాలుచేస్తున్నట్లు కళాకారుల సంఘం కార్యదర్శి ప్రియదర్శిని ముయిక అన్నారు.

కార్తీక వ్రతానికి 19 నుంచి దరఖాస్తులు స్వీకరణ

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో కార్తీక వ్రతాల కోసం ఈ నెల 19వ తేదీ నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రారంభం అవుతుంది. district.odisha.gov.inలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదం కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నవారికి, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

17 నుంచి హెల్త్ క్యాంపులు


స్వస్థనారీ, స్వసక్త పరివార్ పోస్టర్

పర్లాకిమిడి: స్వస్థనారీ.. స్వసక్త పరివార్ అభియాన్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గజపతి జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మహిళలు, బాలికలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేస్తామని జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎం.ఎం.ఆలీ సోమవారం తెలియజేశారు. ఆధార్ కార్డుతో స్వస్థ్య కేంద్రానికి వస్తే హృద్రోగం, డయాబిటీస్, ఓరల్, బ్రెస్ట్, సెర్వికల్ క్యాన్సర్లు, అనీమియా, టీబీ, తదితర టాకాలు ఉచితంగా వేస్తామన్నారు. ఈ హెల్త్ క్యాంపులను సద్వినీయోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రాష్ట్ర మహిళా, శిశు వికాస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

బైకు చోరీ కేసులో.. నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష

రాయగడ: బైకు చోరీ కేసులో ఎస్‌డీజేఎం వర్షాదాస్ కేసు విచారించారు. చోరికి సంబంధం ఉన్న నలుగురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ సోమవారం తీర్పును వెల్లడించారు. జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా కింద చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మరో 6 మాసాలు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది జనవరి 18న చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగావళి నదీ సమీపంలో అడపతిఉగడ గ్రామంలో తొయికా రమేష్‌కు చెందిన బైక్ దొంగతనానికి గురైంది. ఈ మేరకు బాధితుడు చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అరుజు పిడిక, సహదదేవ్ మండంగి, బిజయ్ కుమార్ మండంగి, హరేష్ ఖమారీని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసును విచారించిన ఎస్‌డీజేఎం వర్షాదాస్ 11 మంది సాక్షులను విచారించిన అనంతరం తీర్పును వెలువరించారు.

ముమ్మరంగా తనిఖీలు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితిలో పలు పంచాయతీలలో సహకార సంఘాలు, సొసైటీల గోదాముల్లో జిల్లా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సోమవారం కూడా తనిఖీలు చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ పరపతి సంఘాలు (ప్యాక్స్) ఆధీనంలో ఉన్న యూరియా రైతులుకు అందజేయాలని పర్లాకిమిడి తహసీల్దార్ నారాయణ బెహరా ఆదేశించారు. గుసాని సమితిలో సర్దాపురం, కామధేను, అరగఖండి, శైలాడ, బోమ్మిక గ్రామాలలో పరపతి సంఘాలకు వెళ్లి అధికారులు రికార్డులను తనిఖీలు చేపట్టారు. గజపతి జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు యూరియా అక్రమంగా తరలివెళ్తుందన్న అభియోగాల మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి రవీంద్ర అదక్, కె.సూరజ్‌కుమార్, ఎ.ఆర్.సి.ఎస్ అధికారి హరిహర శెఠి ఉన్నారు.

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం


గవర్నరుకు స్మారక పత్రం సమర్పించిన బీజేడీ ప్రతినిధి బృందం

- భగ్గుమన్న బీజేడీ
- హోరెత్తిన రాజ్ భవన్ పరిసరాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎరువుల కొరత, నల్ల బజారు వ్యవహారాలపై బిజూ జనతా దళ్ రాజ్ భవన్ ఎదుట భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుంది. సకాలంలో ఎరువుల సరఫరాను నిర్ధారించడంలో ఘోరంగా విఫలమైందని బీజేడీ నాయకులు ఆరోపించారు. ఈ నిర్లక్ష్య వైఖరితో రైతాంగానికి సాగు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేడీ కార్యకర్తలు రాజ్ భవన్ ముట్టడించేందుకు విఫల యత్నం చేయడంతో ఆందోళన తీవ్రమైంది. పోలీసులతో ఘర్షణకు దారితీసింది. గవర్నర్ నివాసం వెలుపల ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎరువుల సంక్షోభ పరిస్థితి నిర్వహణలో ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేసి పరిసరాలు మారు మోగించారు. వందలాది మంది బీజేడీ కార్యకర్తలు భారీ నిరసన ఊరేగింపులో పాల్గొన్నారు. రాజ్ భవన్ చేరుకోగానే, నిరసనకారులు దూకుడు నివారణ కంచెని ఛేదించేందుకు ప్రయత్నించారు, దీనితో భద్రతా దళాలతో ఘర్షణ జరిగింది. పరిస్థితి కొద్దిసేపు గందరగోళంగా మారడంతో ఆందోళనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగం చేశారు. ఒడిశా ప్రభుత్వం రాష్ట్ర రైతులతో రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తోంది. వారి దుస్థితిని అంగీకరించడానికి నిరాకరిస్తుంది. రాష్ట్రంలో జరుగుతున్న దైనందిన ఆందోళనకర పరిస్థితుల పట్ల అవగాహన లేకుండా పాలన కొనసాగుతుందని విపక్ష బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం గవర్నర్‌కు మొర పెట్టుకుంది. ఈ పరిస్థితులపై చొరవ కల్పించుకోవాలని గవర్నర్‌ను అభ్యర్థించారు.


కట్టడి కంచెని ఛేదిస్తున్న ఆందోళనకారులు


రాజ్ భవన్ పరిసరాల్లో బీజేడీ వర్గీయుల నిరసన ప్రదర్శన

కీలకమైన పంట కాలంలో రైతులు ఎరువులు పొందలేకపోతున్న పరిస్థితిని ఎత్తిచూపుతూ గవర్నర్ హరిబాబు కంభంపాటికి ఒక స్మారక పత్రం సమర్పించేందుకు ఎమ్మెల్యేలు సహా బిజెడి నాయకుల ప్రతినిధి బృందం రాజ్ భవన్‌లో గవర్నరుని కలిసింది.

వ్యవసాయ శాఖ మంత్రి హామీ

రాష్ట్ర స్థాయిలో ఎరువుల కొరత లేదు. జిల్లాలకు పంపిణీ కొనసాగుతోందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ మాట్లాడుతూ అక్రమ నిల్వలు, విక్రయాలపట్ల తలెత్తిన పరిస్థితుల్లో విభాగం తక్షణమే స్పందించి ఆయా ప్రదేశాలలో దాడులు నిర్వహించి చర్యలు చేపట్టినట్లు వివరించారు. మరో 8 నుంచి 10 రోజుల్లో అభ్యర్థన మేరకు కేంద్రం నుంచి ఎరువులు సరఫరా అయి అవసరాలను గట్టెక్కిస్తాయని మంత్రి హామీ ఇచ్చారు.

ఆందోళన తీవ్రతరం చేస్తాం


సమావేశంలో పాల్గొన్న కార్మిక నేతలు

జయపురం: సేవా పేపరుమిల్లు విశ్రాంత శ్రామికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి యాజమాన్యాన్ని హెచ్చరించారు. సోమవారం స్థానిక యాదవ భవనంలో సేవా పేపరుమిల్లు విశ్రాంత శ్రామికుల అత్యవసర సమావేశం జరిగింది. కార్మిక నేత బసంత బెహరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సేవా కార్మిక సంఘ నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. సేవా యూనిట్ హెడ్ ఎస్.ఎస్.పాల్ రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. మిల్లు నిర్వహణ బాధ్యత కొత్త మార్క్ ఏబీ కంపెని మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అతుల్ డాభే చేతుల్లోకి వెళ్లిందన్నారు. ఆ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకొని ఇతర విషయాలు చర్చించి ఒక కొలిక్కి వచ్చేసరికి ఈ నెల 25వ తేదీ కావచ్చని వెల్లడించారు. ఈ నేపథ్యంలో 19 మంది శ్రామికుల గ్రాట్యుటీ ఫైనల్ చేయాలని, ఓపీడీఆర్ కేసు నోటీసు కంపెనీకి జారీ చేశారని మహంతి వెల్లడించారు. కార్మికులకు గత 14 నెలల జీతాలు చెల్లించలేదని, మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు, విశ్రాంత శ్రామికులకు బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. కొత్త యాజమాన్యం సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే అన్ని వర్గాల కార్మికులు సమైఖ్యంగా పోరాటం సాగించనున్నట్లు మహంతి హెచ్చరించారు. ఈసమావేశంలో కార్మిక నేతలు నారాయణదాస్, మోహన్ చరణ రౌత్, ధృభ మల్లిక్, రత్నాకర బెహరా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

ప్లేఉడ్ పరిశ్రమ భూమి పూజలో నిరసనలు

కొరాపుట్: ప్లేఉడ్ పరిశ్రమ భూమి పూజలో నిరసనలు వ్యక్తం అయ్యాయి. సోమవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి రాణికొన, కడంగుడ, పక్కజోల, లుంగ్రి గ్రామల మధ్య ప్రాంతంలో గ్రీన్‌ప్లై శాండిలా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించే ప్లే ఉడ్ పరిశ్రమకి భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రతిపక్ష బీజేడీకి చెందిన పొట్టంగి మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి వేదిక వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రంగంలోనికి దిగి బలవంతంగా బయటకు పంపించారు. అదే మార్గంలో వస్తున్న కొరాపుట్ జిల్లా కలెక్టర్ సత్యవాన్ మహాజన్‌కు ఈ పరిశ్రమ ఏర్పాటులో లోపాలను ప్రఫుల్ల పంగి ఎత్తి చూపారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు పిలవకుండా ఎలా భూమి పూజ చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఏ పరిశ్రమ ఏర్పాటు చేసినా ఉపాధి కల్పిస్తామని చెప్పి గిరిజనలు నుంచి భూమిని లాక్కుంటున్నారన్నారు. కానీ ఉపాధి కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ప్రఫుల్లను వేదికకు దూరంగా లాక్కుపోయారు. అయిన్పటికీ ప్రఫుల్ల తన వాహనం పైనుంచి నిరసన తెలిపారు. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి వర్చ్యువల్ మోడ్‌లో ఈ పరిశ్రమకు భూమి పూజ చేశారు. ఇక్కడ రూ.606 కోట్లతో రెండు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. సుమారు 1,300 మందికి ఉపాధి లభిస్తుందని సీఎం ప్రకటించారు. ఈ పరిశ్రమలో ప్లే ఉడ్ కాగితం తయారవుతాయి. ఈ కార్యక్రమంలో సమితి చైర్మన్ లిల్లి అంతారియా, వైస్ చైర్మన్ శివ బంగారియా పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగిని లాక్కుపోతున్న పోలీసులు


శిలాఫలకం వద్ద కొరాపుట్ జిల్లా కలెక్టర్ సత్యవాన్ మహాజన్, చైర్మన్, వైస్ చైర్మన్‌లు


ప్రసంగిస్తున్న సీఎం మోహన్ చరణ్ మఝి

రానున్న దశాబ్దం నిత్యహరితం కావాలి: గవర్నర్

- ఓఎస్‌పీసీబీ 42వ వ్యవస్థాపక దినోత్సవం

భువనేశ్వర్: రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కాలుష్య నివారణ కోసం సంప్రదాయ ఇంధన వాహనాలకు స్వస్తి పలికి విద్యుత్ వాహనాలను (ఈవీలు) పౌరులు స్వీకరించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. స్థానిక ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (ఓఎస్‌పీసీబీ) 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఉద్దేశించి సోమవారం గవర్నర్ ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణ, పౌరులకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను నిర్ధారించడానికి సమష్టి చర్య అవసరాన్ని తెలియజేశారు. రాజ్ భవన్ అధీనంలో అధికారిక వాహనాలను విద్యుత్ వాహనాలుగా మార్చి ఇతరులు అనుసరించడానికి ఒక ఉదాహరణగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులను తగ్గించడంతో స్వచ్ఛమైన విద్యుచ్ఛక్తి పొందేందుకు ప్రభుత్వ సబ్సిడీతో ప్రజలు డాబాపై సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గవర్నర్ ప్రోత్సహించారు.

ఓఎస్‌పీసీబీ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రతిబింబిస్తూ, వేగవంతమైన పారిశ్రామికీకరణను పర్యావరణ బాధ్యతతో సమతుల్యం చేయడంలో నియంత్రణ, మార్గదర్శకం మరియు భాగస్వామిగా బహుముఖ పాత్రధారిగా వ్యవహరించినందుకు డాక్టర్ కంభంపాటి బోర్డును ప్రశంసించారు. నేటి వ్యవస్థాపక దినోత్సవం ఒడిశా పర్యావరణాన్ని పరిరక్షించడంలో బోర్డు సమగ్ర, ప్రగతిశీల విధానాన్ని జరుపుకునే వేడుకగా పేర్కొన్నారు. ఈ దిశలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీగా 75 లక్షల మొక్కల పెంపకం కార్యక్రమంలో పౌరులు మరియు విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. గ్రీన్ టెక్నాలజీ, జీరో వేస్ట్ పరిశ్రమలు, యువత భాగస్వామ్యం, పర్యావరణ పర్యవేక్షణ కోసం డిజిటల్ సాధనాల ప్రోత్సాహంతో సహ సాహసోపేతమైన లక్ష్యాలతో రానున్న దశాబ్దాన్ని నిత్యహరితంగా ఆవిష్కరించే దృఢ సంకల్పంతో ఈ సంస్థ కృషి చేయాలని ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా, కాలుష్యాన్ని నియంత్రించడం, స్థిరమైన అభివృద్ధిని సాధించడం సమష్టి బాధ్యత అని నొక్కి చెప్పారు. అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) మరియు ఫారెస్ట్ ఫోర్స్ హెడ్ సురేష్ పంత్, పీసీసీఎఫ్ ప్రేమ్ కుమార్ ఝా వంటి సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ బోర్డు వెబ్‌సైట్, ప్రచురణలను ఆవిష్కరించారు. సైకత కళాకారుడు మానస్ కుమార్ సాహూను సత్కరించారు. కాలుష్య నియంత్రణ ఎక్సలెన్స్, ప్రశంస అవార్డులను ప్రదానం చేశారు. ప్రకృతి పరిరక్షణలో మరియు గ్రీన్‌ప్రెన్యూర్‌లుగా సాధించిన విజయాలకు మహిళలను సత్కరించారు.


పచ్చని మొక్కకు నీరు పోసి వ్యవస్థాపక దినోత్సవం ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు


ఓఎస్‌పీసీబీ ప్రచురణలు ఆవిష్కరించిన గవర్నర్

లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జయపురం: జయపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షునిగా సూర్యప్రకాశ్ రావు, కార్యదర్శిగా ఎమ్.కె.దాస్‌లు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అలాగే మిగతా పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం రాత్రి వెలువరించిన ఫలితాలలో ఉపాధ్యక్షులుగా జి.రమేష్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఎస్.సతీష్,కేషియర్‌గా ఎస్.రామకృష్ణ లు విజయ సాధించినట్లు నూతన కార్యదర్శి ఎస్.కె.దాస్ నేడు పత్రికల వారికి తెలిపారు. సోమవారం స్థానిక 26 వ జాతీయ రహదారిలోగల లారీ ఓనర్స్ అషోషియేషన్ సొంత కార్యాలయంలో ప్రమాణ శ్వీకారం జరిగింది.భగవత్‌గీతపై ప్రమాణం చేస్తూ జరిగిన ప్రమాణ శ్వీకార ఉత్సవం కార్యక్రమంలో కొత్తగాఎన్నికైన అద్యక్షులు సూర్యప్రకాశ్ రావు, కార్యదర్శి ఎమ్.కె దాస్ లతో పాటు నూతన కార్యకర్తలు ప్రమాణ శ్వీకారం చేసారు.ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీదాస్ మాట్లాడుతూ సుధీర్ఘ 22 యేళ్ల తరువాత తిరిగి తనను లారీ ఓనర్సు అసోసియేషన్ కార్యదర్శిగా ఏక గ్రీవంగా సభ్యులు ఎన్నుకొనటం తనకెంతో ఆనందంగా గర్వంగా ఉందన్నారు.అషోషియేషన్‌ను మరింతగా బలోపేతం చేసేందుకు తాను కృషి చేస్తానని సభ్యులను హామీ ఇచ్చారు.పట్టణంలో 250 కిపైగా లారీలు ఉన్నాయని 147 మందికిపైగా లారీ యజమానులు ఉన్నారని వారందరినీ ఏకత్రాటిపై నడిపి వారి ప్రయోజనాలకు,లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం అభివృద్ధికి తాను కృషి చేస్తానని వెల్లడించారు.పట్టణంలో బియ్యం మిల్లులు, కాజూ ప్యాక్టరీలు మొదలగునవి ఉన్నాయని ఆయామిల్లులు, ప్యాక్టరీల యజమానులతో మంచి సంబంధాలు నెలకొల్పి ట్రాన్స్‌పోర్టు వ్యాపారాన్ని పెంచేందుకు కృషి చేస్తామని అవసరం అయితే మినీ ట్రక్కులను ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తామని కార్యదర్శి ఎమ్.కె.దాస్ వెల్లడించారు.


ప్రమాణం చేస్తున్న కార్యదర్శి ఎం.కె.దాస్


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో లారీల యజమానులు

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

పర్లాకిమిడి: జిల్లాలో నువాగడ బ్లాక్ తబరాడ గ్రామ పంచాయతీ భవనంలో సోమవారం జాయింట్ గ్రీవెన్స్ సెల్‌కు అధిక స్పందన లభించింది. జిల్లా ఎస్పీ జ్యోతింద్రకుమార్ పండా, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి శంకర కెరకెటా హాజరయ్యారు. తబరాడ గ్రామ పంచాయతీతోపాటు కె.జలార్‌సింగి, ఖోజురిపద గ్రామాల నుంచి మొత్తం 92 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 68, గ్రామ సమస్యలకు సంబంధించినవి 24 ఉన్నాయి. ఒక అభియోగాన్ని అధికారులు వెంటనే పరిష్కరించారు. సామాజిక పింఛన్లను ముగ్గురు దివ్యాంగులకు జిల్లా ఎస్పీ పండా అందజేశారు. ఈ సందర్భంగా తబరాడ గ్రామ పంచాయతీ ఆవరణలో మెడికల్ క్యాంప్‌ను సీడీఎంఓ ఏర్పాటు చేశారు. గ్రీవెన్స్‌కు నువాగడ పంచాయతీ సమితి అధ్యక్షురాలు మాలతి ప్రధాన్, బీడీఓ లోకనాథ శోబోరో, తహసీల్దార్ మోనాలిసా ఆచార్య, సి.డి.ఎం.ఓ ఎం.ఎం.ఆలీ, తదితరులు పాల్గొన్నారు.


మహిళా స్వయం సహాయక గ్రూపుల తయారీ వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ జ్యోతింద్ర పండా

రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక యుగం

- 27 కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపన


పరిశ్రమల వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి


పారిశ్రామిక ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రితో ఇతర ఉన్నతాధికారులు

భువనేశ్వర్: రాష్ట్రం సరికొత్త పారిశ్రామిక యుగం వైపు రాష్ట్రం పయనిస్తోందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆనందం వ్యక్తం చేశారు. ఒడిశాను తూర్పు భారతదేశం యొక్క తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధునాతన, ప్రపంచ వ్యాప్త పోటీ ఉత్పత్తులపై దృష్టి సారించాలని పెట్టుబడిదారులు, భావి పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన 12 జిల్లాల్లో 27 కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఓయూఏటీ కన్వెన్షన్ సెంటర్‌లో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. గంజాం, ఖుర్దా, ఝార్సుగుడ, కొరాపుట్, అంగుల్ ప్రాంతాల్లో ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసి ఇతర జిల్లాల్లోని సంప్రదాయ రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ పరిశ్రమలతో రాష్ట్రానికి రూ. 25,379 కోట్ల పెట్టుబడులు చేకూరుతాయి. రాష్ట్ర యువతకు 51,826 ఉద్యోగాలను సృష్టిస్తాయన్నారు. ఈ ప్రాజెక్టులు పునరుత్పాదక ఇంధనం, ఔషధాలు, వస్త్రాలు వంటి అధిక విలువైన రంగాలలో విస్తరించి ఉన్నవిగా పేర్కొన్నారు. రాష్ట్ర విధానాలు, దార్శనికతపై విశ్వాసంతో పెట్టుబడిదారులు ఔత్సాహికంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నుంచి 58 ప్రాజెక్టులు ఇప్పటికే 1,11,899 పైబడి ఉద్యోగాలను సృష్టించాయి. ఉపాధి ఆధారిత అభివృద్ధికి అచంచలమైన నిబద్ధతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆయుధాలతో భారీ నిరసన ప్రదర్శన

కొరాపుట్: దండకారణ్య గిరిజనులు తమ సంప్రదాయ ఆయుధాలతో భారీ నిరసన ప్రదర్శన చేశారు. సోమవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితిలో వేలాది మంది గిరిజనులు ఈ ర్యాలీ చేశారు. పొట్టంగి, సిమిలిగుడ సమితుల్లో కొట్టియా, మాలిపుట్, నువాగుడ, కుడి, సొరుసు పొదర్, పొట్టంగి సమితుల్లో 21 గ్రామాల్లో సేరుబందు పర్వతాలు విస్తరించి ఉన్నాయి. వాటిలో అపారమైన బాక్సైట్ గనులు నిక్షిప్తమై ఉన్నాయి. వీటిని తవ్వకోవడానికి ప్రభుత్వం చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. కానీ గిరిజనులు అడ్డగిస్తున్నారు. గనుల తవ్వకాలు జరిపే ముందు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నారు. అనేక రాష్ట్రాలలో ఉన్న విధంగా పెసా చట్టం అమలు చేయాలంటున్నారు. అదే విధంగా పల్లె సభ అనుమతి తీసుకోవాలని చట్ట పరమైన డిమాండ్ చేస్తున్నారు. ముందుగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిర్వాసితులకు పరిహారాలు, ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. కానీ ప్రభుత్వం చెవికెక్కించుకోవడం లేదు. దీంతో గిరిజనులు భారీ ర్యాలీ చేశారు. మాజీ ఎంపీ జయరాం పంగి ఈ ఆందోళను ముందుండి నడిపించారు. పొట్టంగి తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని గిరిజనులు తమ వినతి పత్రం సమర్పించారు. తమ ఆవేదన రాష్ట్రపతికి పంపాలని విజ్ఞప్తి చేశారు.


పొట్టంగిలో సంప్రదాయ ఆయుధాలతో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

క్లుప్తంగా

రైల్లో తనిఖీలు


రాయిపూర్ పాసింజర్‌లో తనిఖీలు చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి, డాగ్‌స్క్వాడ్

పార్వతీపురం రూరల్: గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నివారించేందుకు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రాయపూర్ పాసింజర్ రైల్లో జీఆర్‌పీ, ఆర్పీఎఫ్, డాగ్ స్క్వాడ్, ఈగల్ టీం సంయుక్తంగా పార్వతీపురం రూరల్ సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో, భోగీలలో ప్రయాణికుల లగేజీలను, అనుమానితులను తనిఖీ చేసినట్లు ఆమె చెప్పారు.

అప్రమత్తంగా ఉండి సమాచారం ఇవ్వండి

సాలూరు పట్టణంలో సోమవారం జరిగిన చైన్స్ స్నాచింగ్‌కు సంబంధించిన నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారని, ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరి మీదనైనా అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సంతోషి కోరారు. ఈ సందర్భంగా నిందితులు పరారవుతున్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన చిత్రాలను ఆమె విడుదల చేశారు.

భవనంపై నుంచి జారిపడి కార్మికుడి మృతి



పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని సౌందర్య థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం పైనుంచి శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆరిక మోహనరావు(43) అనే వ్యక్తి నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. ఈ మేరకు ప్రాథమిక విచారణలో నిర్ధారించినట్లు పార్వతీపురం పట్టణ ఎస్సై గోవింద తెలిపారు. మృతుడు కిందికి ప్రమాదవశాత్తు జారిపడిన సమయంలో సమీపంలో గల కళాశాల విద్యార్థి ఒకరు చూసినట్లు ఎస్సై చెప్పారు. కురుపాం మండలం ఒబ్బంగి పంచాయతీ లిక్కిడిగూడ గ్రామానికి చెందిన మోహనరావు భార్య సుహాసిని ఇటీవల మరణించింది. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు సత్యవతి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి రమణ తదితరులు

సాలూరు: పట్టణంలోని రామాకోలనీలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు చోరీ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామా కాలనీకి చెందిన అక్కేరపు సత్యవతి(65) సోమవారం మధ్యాహ్నం ఇంటిలో నిద్రిస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంటి తలుపుకొట్టడంతో ఆమె బయటకు వచ్చింది.ఆమెకు ఇంటిపక్కనే ఖాళీగా ఉన్న రెండో ఇల్లు అద్దెకు కావాలని, ఇల్లు చూపించమని ఆ వ్యక్తులు కోరారు. ఈ క్రమంలో ఇంట్లో బెడ్ రూం ఎక్కడ ఉందో చూపించమనగా ఆమె ఇంటిలోకి వెళ్లింది. దీంతో ఓ వ్యక్తి ఆమె చేతులను గట్టిగా పట్టుకోగా రెండో వ్యక్తి ఆమె మెడలో గల సుమారు 5 తులాల బంగారు గొలుసును తెంపేసి వెంటనే ఓ స్కూటీపై పరారయ్యారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా అప్పటికే దొంగలు పారిపోయారు. తరువాత ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి రమణ తదితరులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు 37 మంది ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ బాల, బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో బాలురకు, అండర్-17 విభాగంలో బాల, బాలికలకు నిర్వహించిన పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 200మందికి పైగా క్రీడాకారులు హాజరై పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ బరువుల కేటగిరీల వారీగా ఎంపికలు నిర్వహించగా రెండు విభాగాల్లో మొత్తం 37 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు అర్హత సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మిలు తెలిపారు. పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ ప్రారంభించగా..శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, ఖేలో ఇండియా కోచ్ సీతారామంజనేయులు పర్యవేక్షించారు. పోటీలకు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పట్టణాలకు రోగుల పరుగు..!


జిల్లా ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం క్యూలో నిల్చున్న గ్రామస్తులు

- నాడు ఇళ్లవద్దకే వైద్యసేవలు
- నేడు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి
- గిరిజన ఆరోగ్యంపై సర్కారు చిన్నచూపు


సీతానగరం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు(ఫైల్)

పార్వతీపురంటౌన్: అసలే వర్షాకాలం. సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు, విషజ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉంది. గిరిజన, గిరిశిఖర గ్రామాల్లో విషజ్వరాలు విలయ తాండవం చేస్తున్నాయి. గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సిన ప్రభుత్వం, యంత్రాంగం గిరిజనుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఇంటికో జ్వరపీడితుడు ఉన్నా తూతూ మంత్రంగానే వైద్యసేవలు అందుతున్నాయి తప్ప తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామాల్లో సరిగ్గా వైద్యసేవలు అందక, పీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందక పట్టణాల్లో గల ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీసి వైద్యం చేయించుకోవల్సిన దుస్థితి గిరిజనులకు ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి గ్రామాల్లోనే సూపర్ స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యశిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం కార్పొరేట్ వైద్యాన్ని ప్రజల వద్దకు తీసుకువచ్చారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సమస్య తలెత్తరాదనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఇళ్లవద్దనే పరీక్షలు నిర్వహించి గ్రామాల్లోనే 105 రకాల మందులను అందజేసి గిరిజనుల ఆరోగ్యానికి భద్రత కల్పించారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని, గిరిజనులంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యానికి భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

నాడు 1,42,191 మందికి గ్రామాల్లోనే వైద్యసేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజన, మైదాన గ్రామాల్లో కార్పొరేట్ వైద్యులతో వైద్యశిబిరాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 364 వైద్యశిబిరాలు నిర్వహించి 1,42,191 మందికి వైద్య సేవలు అందించారు. అందులో 91,178మందికి బీపీ, 4,571మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించి చికిత్స, వారికి అవసరమైన మందులను అందజేశారు. 2,547మందిని వివిధ రోగాల నిమిత్తం వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి రిఫర్‌చేయగా 2,316 మందికి చికిత్స పొందారు. 18,773 మందికి కంటివైద్యపరీక్షలు నిర్వహించి 1260మందికి కేటరాక్ట్ సమస్య గుర్తించి 232మందికి శస్త్రచికిత్స పూర్తిచేశారు. ఈ శిబిరాల్లోనే 1,229మందికి కళ్లజోళ్లను అందజేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇళ్లవద్దకే వైద్యసేవలు

దేశంలో ఎక్కడా లేని విధంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతిరోజూ గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం వైద్య సేవలు అందించింది. గిరిజన గ్రామాల్లో మంచాన పడి ఉన్న గర్భిణులు, వృద్ధుల ఇళ్లవద్దకే వెళ్లి ఉదయం సమయంలో వైద్యసేవలు అందించి మధ్యాహ్న సమయంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలను అందించేవారు. గ్రామాల్లోనే రక్తపరీక్షలు నిర్వహించి రోగాలను గుర్తించి మందులను అందించేవారు. పట్టణాలకువెళ్లే పరిస్థితి లేకుండా గ్రామాల్లోనే 105 రకాల మందులను అందుబాటులో ఉంచేవారు.

ఆ పరిస్థితి కానరాదు

గ్రామాల్లో గతంలో మాదిరి వైద్యసేవలు అందే పరిస్థితి ప్రస్తుతం లేదు. తూతూ మంత్రంగానే 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందించి మమ అనిపిస్తున్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు, మారుమూల గ్రామస్తులు వేడుకుంటున్నారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతూ దూరప్రాంతాలకు ప్రయాణం చేసి ఆస్పత్రుల వద్ద లైన్‌లో నిలబడి వైద్యం పొందాల్సిన దుస్థితి ఉందని ప్రభుత్వం, యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో వైద్యసేవలు, రక్తపరీక్షలు, మందులు, వైద్య శిబిరాలు అందుబాటులోకి తీసుకువచ్చి గిరిజన ఆరోగ్యానికి భద్రత కల్పించాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

వైద్యశిబిరాల నిర్వహణకు ప్రణాళికలు



జిల్లాలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నందున వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ప్రస్తుతం 104 సంచార వాహనాల ద్వారా వైద్యసేవలందిస్తున్నాం. వైద్యశిబిరాల నిర్వహణకు సంబంధించి వైద్యులను అందుబాటులో ఉంచాం. అతి త్వరలో గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించి గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాం. – ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

గ్రీవెన్స్‌సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మహిళ

- మల్కన్‌గిరి కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్

మల్కన్‌గిరి: ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ అన్నారు. కోరుకొండ సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన పాల్గొని 42 వినతులు స్వీకరించారు. వాటిలో రేషన్ కార్డులు కావాలని , విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని వినతులు అందించారు. 68 మందికి శ్రామిక కార్డ్ లు అందించగా మారో 26 శ్రామిక కార్డులను అందజేశారు. అనంతరం కలెక్టర్ కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యా బోధన, మధ్యాహ్నం భోజనం అమలుపై ఆరా తీశారు. విద్యార్థులకు పాఠాలు బోధించి జవాబులు రాబట్టారు. జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, డీఎఫ్‌వో సాయి కిరణ్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ సోభరో పాల్గొన్నారు.


చిన్న పిల్లడితో వచ్చి కలెక్టర్‌కు తన సమస్యను వివరిస్తున్న మహిళ


గ్రీవెన్స్ సెల్‌కు హాజరైన అధికారులు


వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు


ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న కలెక్టర్


విద్యార్థులకు పాఠాలు చెబుతున్ కలెక్టర్

ఆందోళన వద్దు.. వదంతులు నమ్మవద్దు

- రూరల్ సీఐ రంగనాథం


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ రంగనాథం

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామ సమీపంలో గల నేలబావి వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో విగ్రహం ధ్వంసం జరిగిందన్న ఘటనపై పార్వతీపురం రూరల్ సీఐ రంగనాథం, ఎస్సై సంతోషికుమారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన ఘటనపై వివరించారు. కొన్నేళ్ల క్రితం అమ్మవారి విగ్రహంలో ఎడమచేయి శిథిలమవడంతో మరమ్మతులు చేసి స్థానిక భక్తులు ఏర్పాటు చేశారని ఈ మేరకు క్రమేణా మళ్లీ అదే చోట శిథిలమైనట్లు తమకు సమాచారం వచ్చిన వెంటనే క్లూస్‌టీం ద్వారా పరిశీలించి, అ స్థానిక గ్రామ పెద్దలు, భక్తులతో మాట్లాడి విచారించిన అనంతరం ఎలాంటి విధ్వంస చర్యలు జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని, అలాగే ఇలాంటి సున్నితమైన విషయాలు, వదంతాలు స్పష్టత లేకుండా నమ్మవద్దని తెలిపారు.

రేపటి నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖాధికారులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఈనెల 17వ తేదీ బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరగనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన బ్యానర్లు, పోస్టర్లను సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్‌ఓ హేమలత, ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డా.జి. నాగభూషణరావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు లతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పారామెడికల్ సిబ్బంది ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులతో నిర్వహించనున్నందున అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతలు ఈ శిబిరాలకు తీసుకు రావాలని ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశవర్కర్లు మాత్రమే కాకుండా జిల్లా, మండల గ్రామస్థాయిలో వైద్యశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖతోపాటు స్థానిక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించి వైద్య శిబిరాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, మరికొంతమంది జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జనసేన మండల అధ్యక్షుడిపై పిర్యాదు


ఐటీడీఏ పీఓకు వినతి ఇస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు


ఎంపీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సీతంపేట: సోషల్ మీడియా వేదికగా సర్పంచ్‌లను దుర్భాషలాడినందుకు జనసేన పార్టీ సీతంపేట మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాథంపై కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓలకు ఫిర్యాదు చేసినట్లు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 73వ రాజ్యాంగ సవరణలో ఆర్టికల్ 243 ప్రకారం రాజ్యాంగం 11వ భాగం ప్రకారం రాజ్యాంగ బద్ధంగా ఎన్నికై గౌరవప్రదమైన పదవుల్లో ఉన్న వ్యవస్థపై అసభ్యపదజాలం, పోస్టింగ్‌లతో కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విశ్వనాథంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నికైన తాము ఏనాడు పార్టీల పరంగా భేదాభిప్రాయాలు తలెత్తేలా నడుచుకోలేదన్నారు. ఇప్పుడు జనసేన నాయకుడు సర్పంచ్‌లను దొంగనాకొడుకులు అంటూ అసభ్యంగా పెట్టిన పోస్టులు తమ మనోభావాలు పూర్తిగా దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. శాంతిభద్రతలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన విశ్వనాథంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు ఎస్.తిరుపతిరావు, కె.వెంకునాయుడు, ఎస్.బాపయ్య, హెచ్.ఆదిలక్ష్మి, జె.సుందరమ్మ, బి.తిరుపతిరావు, ఎస్.ప్రవీణ్, ఇసోని, రాజయ్య, జెడ్‌పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, ఎస్.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంటాతిలిన్ పోటీల్లో రావాడ విద్యార్థి ప్రతిభ


పెంటాతిలిన్ పోటీల్లో కాస్య పతకం పొందిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భోగాపురం: ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బీహర్ రాష్ట్రంలోని బిగుసరాయ్ వద్ద గల బీహట్ గ్రౌండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పెంటాతిలిన్ పోటీల్లో భోగాపురం మండలం రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి అమనాపు భీష్మ కాస్య పతకం పొందాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఏ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీష్మకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నచ్చిరెడ్డి సూర్యనారాయణతో పాటు పాఠశాల సిబ్బంది ఆ విద్యార్థిని అభినందిచారు.

పశువుల కంటైనర్ బోల్తా


బోల్తా పడిన పశువుల కంటైనర్


ప్రమాదం తర్వాత బయటకు తీసిన పశువులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి26పై గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న పశువుల కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. సోమవారం వేకువజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. పశువులను రవాణా చేస్తుండగా కంటైనర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడి పోయింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు పశువులకు ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ హుటాహుటిన లారీ యాజమాన్యంతో పాటు పశువులను రవాణా చేస్తున్న వారు భారీ క్రేన్లు తీసుకువచ్చి లారీని బయటకు తీసి, అలాగే లారీలో రవాణా చేస్తూ ప్రమాదంలో చెల్లాచెదురైన పశువులను బయటకు తీసి వాటిని వేరే వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా పోలీసులకు తెలియకుండా తరలించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి


అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ

పార్వతీపురం రూరల్:

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమర్పించే అర్జీదారుల వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలపి పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అధ్యక్షతన జరిగిన పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్‌ఓ కె.హేమలత, సబ్ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డిలు అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ధాత్రిశ్రీ తల్లికి వందనం డబ్బులు జమకాలేదని, జిల్లా కేంద్రంలోని కొత్తవలసకు చెందిన రౌతు పారినాయుడుకు పింఛన్ మంజూరు చేయాలని, వెంకటసాగరం ఆయకట్టులో 40 ఎకరాలకు సక్రమంగా నీరు అందించాలని సీతానగరం మండలం అంకలాం రైతులు కోరారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపండి

పార్వతీపురం రూరల్: ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధిత పోలీసుశాఖ అధికారులు జవాబుదారిగా వ్యవహరించి పరిష్కారం చూపాలని ఏఎస్పీ అంకితా సురానా అన్నారు. అలాగే నిర్దేశించిన సమయంలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వచ్చిన 10 ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం, ఎస్సై రమేష్‌నాయుడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 42 అర్జీలు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 42 అర్జీలు వచ్చాయి. ముగడపేటకు చెందిన రమణమ్మ హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి అందజేసింది. యోగా టీచర్ పోస్టు ఇప్పించాలని మండ గ్రామానికి చెందిన సవర శ్రీను, కొండపోడు పట్టాలు ఇప్పించాలని బంజారుపేట గిరిజనులు కోరారు. జీజీవలస గ్రామస్తులు శ్మశానవాటికకు సీసీ రోడ్డు, ప్రహరీని నిర్మించాలని వినతులు అందజేశారు. పెద్దగూడకు చెందిన సవర మంగయ్య బ్యాటరీ స్ప్రేయర్ ఇప్పించాలని, కమ్యూనిటీహాల్ మంజూరు చేయాలని కరడంగివలస గ్రామస్తులు కోరారు. పీజీఆర్ఎస్‌లో ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీఈవో రామ్మోహన్‌రావు, ఉపవైద్యాధికారి విజయపార్వతి, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారు సంతృప్తి చెందాలి


వినతుల స్వీకరణలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

- డీఆర్‌ఓ ఎస్. శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కారం వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత జిల్లా అధికారులదేనని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి స్పష్టం చేశారు. ఫిర్యాదులు పరిష్కరించే ముందు నోటీసులు జారీ చేసి విచారణ చేసి రికార్డు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గడువులోగా వినతులకు పరిష్కారం చూపని ఎడల సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజల నుంచి మొత్తం 162 వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణలో డీఆర్‌ఓతోపాటు డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు.